క్లుప్తంగా

ఆదివాసీ హెల్ప్‌లైన్ చేయూత

ఇల్లెందురూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఇందిరానగర్‌కు చెందిన జోగ జనార్దన్‌కు ఆదివాసీ హెల్ప్‌లైన్ ప్రతినిధులు మంగళవారం రూ.11వేలు ఆర్థిక సాయం అందించారు. జనార్దన్ బ్రెయిన్ సర్జరీ కోసం ఆస్పత్రిలో చేరాడు. శస్త్రచికిత్సకు రూ.3లక్షలు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పడంతో ఆర్థిక సహకారం కోసం కుటుంబసభ్యులు ఆదివాసీ హెల్ప్‌లైన్‌ను సంప్రదించారు. స్పందించిన ప్రతినిధులు ఆదివాసీ ఉపాధ్యాయుల నుంచి రూ.11వేల విరాళాలు సేకరించారు. ఆ మొత్తాన్ని హెల్ప్‌లైన్ సభ్యులు కల్తి భాస్కర్, బొల్లి అంజయ్య జనార్దన్ కుటుంబానికి అందజేశారు.

ఫైర్ ఆఫీసర్‌గా నవీన్



ఇల్లెందు: ఇల్లెందు ఫైర్ ఆఫీసర్‌గా మేదరమెట్ల నవీన్ నియామకం అయ్యారు. మంగళవారం ఇల్లెందు ఫైర్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2023 నవంబర్‌లో ఫైర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

కుమ్మరులకు ప్రాధాన్యత కల్పించాలి

పాల్వంచ: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మరులకు ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బాదిశ శంకర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ... దేవదాయ శాఖలో ఉన్న దేవాలయాల కమిటీలో తమకు స్థానం కల్పించాలన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయాల సేకరణ

టేకులపల్లి: రాష్ట్ర వ్యాపిత కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇల్లెందు నియోజకవర్గానికి సంబంధించిన రైతు నేస్తం కార్యక్రమం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని రైతు వేదికలో రైతు నేస్తం నిర్వహించారు. టేకులపల్లి, ఇల్లెందు మండలాల రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రితో పాటు క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు నేరుగా రైతులతో మాట్లాడారు. రైతులకు రైతు భరోసా పథకం అమలు చేసేందుకు చేపట్టాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అర్హతలు తదితర అంశాలపై రైతులతో చర్చించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ, ఇల్లెందు వ్యవసాయ సంచాలకులు పి.వాసవీరాణి, ఇల్లెందు, టేకులపల్లి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పనివేళలు మార్చొద్దు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో పనివేళలను మారుస్తూ యాజమాన్యం ఈనెల 18న సర్క్యులర్ విడుదల చేసింది. ఈ నేపథ్యాన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల అభిప్రాయాలు సేకరించేందుకు జీఎం (పర్సనల్) దీక్షితులు మంగళవారం నాయకులతో చర్చించారు. ఈ మేరకు ఉద్యోగులు ఉదయం 9.40 రావాలని, భోజన విరామం ఒంటి గంట నుంచి 1.40 వరకు, సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలని సూచించారు. ఏఐటీయూసీ నాయకులు మాత్రం ఈ సమయాలు గనుల విభాగాల్లో అమలు చేయాలే తప్ప, ప్రధాన కార్యాలయాల్లో సాధ్యం కాదని, పాత విధానాన్నే అమలు చేయాలని కోరారు. వివిధ విభాగాల జీఎంలు, ఉద్యోగులు పాల్గొనగా, ఏఐటీయూసీ నుంచి రమణమూర్తి, వంగా వెంకట్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

1975 ఎమర్జెన్సీపై నిరసన ర్యాలీ..

చుంచుపల్లి: భారతదేశంలో అలనాటి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ శ్రేణులు కొత్తగూడెంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు సారంగుల అమర్‌నాథ్ పాల్గొని ప్రసంగించారు. 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించారని, ఇది భారతదేశ ప్రజాస్వామ్యంలో చీకటిరోజు అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తూ చైతన్యపరచాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, తాటిపాముల ఐలయ్య, ఎర్రంరాజు బెహార, బిజ్జం శ్రీనివాస్‌రెడ్డి, బైరి నిర్మల, గొడుగు శ్రీధర్ పాల్గొన్నారు.

జీఎంను కలిసిన సీఐ, ఎస్‌ఐ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్‌ను ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆయనను కలిసి ఓసీ గనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణకు పోలీసుల సహకారం అవసరం అని జీఎం సూచించారు. కార్మికవాడల్లో చోరీలు సాగుతున్నాయని, పోలీసులు రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలని సీఐను కోరారు. ఎస్‌ఐ సందీప్, ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే.వెంకటేశ్వర్లు ఉన్నారు.

అధ్వానంగా రహదారులు

- అడుగుకో గుంత.. ప్రయాణమెట్లా?
- మంజూరైన నిధులు వెనక్కి..
- ప్రమాదకరంగా రాకపోకలు
- పట్టించుకోని అధికారులు



కొత్తగూడెం హెడ్డాఫీస్ సంత వద్ద ప్రమాదకరంగా రోడ్డు



పాల్వంచరూరల్: మల్లారం రహదారిపై కుంగి ప్రమాదకరంగా ఉన్న లోలెవల్ చప్టా



పాల్వంచరూరల్: అధ్వానంగా మారిన మల్లారం రహదారి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణంలోని పలు రహదారులపై గుంతలతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొత్తగూడెం సెవెన్ హిల్స్ ఏరియాలో అండర్ బ్రిడ్జిని ఆనుకుని మెయిన్ ఆస్పత్రికి వెళ్లే రోడ్డులో ప్రమాదం పొంచి ఉంది. అండర్ బ్రిడ్జి పక్క నుంచి ప్రయాణిస్తున్న క్రమంలో ఏ మాత్రం ఆదమరిచినా వాహనదారులు దాదాపు ఐదు అడుగుల లోతులో ఉన్న అండర్ బ్రిడ్జి రోడ్డుపై పడిపోతారు. పగలు ప్రయాణించాలంటేనే భయం.. అలాంటిది రాత్రిళ్లు అయితే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. అదుపు తప్పి కిందపడి ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామవరంలోని బిల్డింగ్ ఆఫీస్ కార్యాలయం ఎదురుగా దాదాపుగా మూడు అడుగుల లోతులో 10 మీటర్ల దూరం వరకు డ్రెయినేజీ కోసం ఏర్పాటు చేసిన గుంతలు అలాగే ఉన్నాయి. కొత్తగూడెం హెడ్డాఫీస్ సింగరేణి క్వార్టర్స్ ఎదుట డ్రెయినేజీ గుంతగా మారి రోడ్డు పక్కన ఎలాంటి రక్షణ లేకుండా ఉంది. దీంతో ఆ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు పగలు భయపడుతూ నడుపుతుంటే రాత్రిళ్లు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. సింగరేణి అధికారులకు, మున్సిపల్ అధికారులకు, ఇటు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పదించ లేదు.

పాల్వంచ మండలంలో..

పాల్వంచరూరల్: గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి నాలుగు సంవత్సరాల క్రితం రూ.1.33 కోట్ల నిధులు మంజూరైనా టెండర్లు పూర్తికాక పోవతో నిధులు వెనక్కి వెళ్లాయి. దీంతో రెండు గ్రామాల రోడ్డు అధ్వానంగా మారాయి. రోడ్లపై పలుచోట్ల కంకరతేలి, అడుగుకో గుంత ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. లక్ష్మీదేవిపల్లి నుంచి మల్లారం, నర్సింహాసాగర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదార్లు అనేక సంవత్సరాల క్రితం నిర్మించడంతో నేడు అధ్వానంగా మారాయి. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి ఏ గుంత ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. అయినా అధికారులు మాత్రం స్పందించడం లేదు. వాహనదారులు తరుచు ప్రమాదాలకు గురవుతున్నారు.

నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరు...

లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు నుంచి మల్లారం గ్రామం వరకు ఎంఆర్‌ఆర్ స్కీమ్ (మెయింటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్లు) కింద రూ.62 లక్షలు మూడు కిలోమీటర్లు, నర్సింహాసాగర్ గ్రామం వరకు రూ.22 లక్షలతో ఒక కిలోమీటరు రోడ్డు మంజూరు చేసింది. కేఎస్పీ రోడ్డు నుంచి పాయకారి యానంబైల్ వరకు రూ.75 లక్షలు, దేవిజ్యా తండా వరకు రూ.40 లక్షలు మంజూరయ్యాయి. నాలుగేళ్లుగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రెండు రోడ్ల నిర్మాణం కోసం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో నిధులు వెనక్కువెళ్లాయి.

కంచె ఏర్పాటు చేయాలి...



నేను ప్రైవేట్ ఉద్యోగిని మాది హనుమాన్ బస్తీ నుంచి ప్రతీరోజు సెవెన్ హిల్స్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తుంటా. ఆ సమయంలో సెవెన్ హిల్స్ వద్ద అండర్ బ్రిడ్జిపై ఎలాంటి రక్షణ లేకుండా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు తక్షణమే రక్షణగా కంచె లేదంటే గోడ నిర్మించి వాహనదారులకు రక్షణ కల్పించాలి.

– దావూద్, కొత్తగూడెం

అధికారులు స్పందించాలి...



మల్లారం నుంచి లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు వరకు మూడు కిలోమీటర్ల రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరై నాలుగేళ్లయినా నిర్మాణం చేయడం లేదు. రోడ్డుపై కంకరతేలి, గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రోడ్డు నిర్మాణం చేయాలని అధికారులకు, రాజకీయ నేతలకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– ఈసం విజయ్, మల్లారం, పాల్వంచ మండలం

నాలుగుసార్లు టెండర్లు నిర్వహించాం..



ఎంఆర్‌ఆర్ స్కీమ్ కింద 2020లోనే రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రహదారుల నిర్మాణానికి నాలుగుసార్లు టెండర్లు పిలిచాం. అయినా కాంట్రాక్ట ర్లు ఎవరూ టెండర్లు వేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేకపోయాం. ఇప్పుడు ఆ నిధులు వెనక్కి వెళ్లాయి. అవకాశం ఉంటే మరోసారి ప్రతిపాదనలు పంపుతాం.

– అనిల్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ

కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామ పంచాయతీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ ఉద్యోగుల, కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వెంకటయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా.. ఒక్క హామీ కూడా నెరవేరలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి మిలిటెంట్ ఉద్యమాలకు సిద్ధం కావాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు.

ధర్నా వద్దకు వచ్చిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు కార్మికులు చేసిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసువెళ్లి మాట్లాడతానన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డా రవికుమార్, గద్దల శ్రీనివాసరావు, కె.సత్య, భూక్యా రమేష్, సాయిరత్న, గంటా శ్రీనివాసరావు, వెంకటప్పయ్య, తోకల నరేష్, కల్యాణ్, విజయ్, కాంతారావు, విజయలక్ష్మి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

జూలై 1న చలో హైదరాబాద్

కొత్తగూడెంటౌన్: జూలై 1న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరగనున్న గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ సమన్వయ కమిటీ కోకన్వీనర్ న్యాయవాది రమేష్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. లంబాడ హక్కుల పోరాట సమితి 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజన తెగల హక్కుల కోసం 27 ఏళ్లుగా పనిచేసి అనేక హక్కులను సాధించుకున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 18 కోట్ల మంది బంజారాలు మాట్లాడే గోర్ బోలీసీ (లంబాడ బాషను) 8వ షెడ్యూల్‌లో చేర్చడానికి తండాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌నాయక్, నాగేశ్వరావు నాయక్, మాలోతు రమేష్ రవి, సురేష్ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. జగన్నాథపురం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల గ్రూపులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న మహిళా శక్తి ద్వారా మొబైల్ ఫిష్ రిటైల్ షాపు, మిల్క్ పార్లర్, ఈవెంట్ మేనేజర్, మీసేవ సెంటర్లు, క్యాంటీన్లు, గేదెల పెంపకం, కోళ్లఫారం ఏర్పాటుకు డ్వాక్రా సంఘాల సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. పెద్దమ్మ గుడి వద్ద కమ్యూనిటీ మరుగుదొడ్ల ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ గుడి ఈఓ ఎస్.రజనీకుమారి, ఎంపీఓ బొగ్గ నారాయణ, ఏపీఎం రాంబాబు, ఏపీఓ రంగా, సీసీ మురళి, కార్యదర్శి సాయిరాం, క్షేత్ర సహాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

30న రైతుకూలీ సంఘం జనరల్ కౌన్సిల్

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 30న మహబూబాబాద్‌లో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ ఊక్లా పిలుపునిచ్చారు.

మంగళవారం స్థానిక కొత్తగూడెంలో జరిగిన కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. మాట్లాడుతూ... అందరికీ అన్నం పెట్టే రైతుకు పాలకులు సున్నం పెడుతున్నారని, దేశానికి రైతే వెన్నెముక అని మాటలు చెబుతున్న పాలకులు దానిని విరగ్గొడుతూ, వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని, అనేక ఆర్థిక ఇబ్బందులతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, దేశంలో రైతులకు భరోసా లేకుండా పోయిందని వాపోయారు. బ్యాంకు రుణాలు, అప్పుల బాధతో రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, రైతుబంధు తదితర రైతు సంక్షేమ పథకాలు పాలకుల హామీలకే పరిమితం చేశారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. కేంద్రంలో ఎన్డీఏ కూటమితో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం గతంలో చేసిన రైతు వ్యతిరేక మూడు చట్టాలను వెనక్కి తీసుకోవాలని, దేశంలో వ్యవసాయానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. గత ఉద్యమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణకై మహబూబాబాద్‌లో జరగనున్న కార్యక్రమంలో రైతులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేకల రమణ, లక్ష్మి, జే.గణేష్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఇల్లెందురూరల్: ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు తెలిపారు. ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, కారేపల్లి మండలాల పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి 6 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా..

ఇల్లెందురూరల్: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి పిలుపునిచ్చారు. మండలంలోని పోలారం, కొమరారం గ్రామపంచాయతీలలో మంగళవారం నిర్వహించిన హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, కార్మికులకు సామాజిక భద్రతతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

చట్టాలపై దృశ్యరూపక అవగాహన

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మూడు చట్టాలపై మంగళవారం గ్రామ పంచాయతీలలో వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్షియా అభినియాం చట్టాలపై గ్రామాలలోని స్వయం సహాయక సంఘాలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులకు అవగాహన కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించిందని ఎంపీడీఓ ధన్‌సింగ్ తెలిపారు. పలు గ్రామాల్లో వెబ్‌కాస్టింగ్ అవగాహన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

శాశ్వత పరిష్కారం చూపిస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచరూరల్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ద్వారా అధిక నిధులు రాబట్టి తద్వారా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోములగూడెం గ్రామంలో మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. సోములగూడెం, కమ్మరిగూడెం గ్రామాల నుంచి వంద మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాసంఘాల నాయకులు బాధ్యతలు స్వీకరించి నిత్యం ప్రజలతో మమేకవుతూ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, ప్రజల మౌలిక అవసరాలైన తాగునీరు, వైద్యం, రహదారుల సౌకర్యాల వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ముత్యాల విశ్వనాథం, ఎస్‌కే సాబీర్‌పాషా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, ముత్యాల కిరణ్‌కుమార్, ఇట్టి వెంకట్రావు, ఎరుకుల వెంకటేశ్వర్లు, వేములపల్లి శేఖర్, ఆవుల సతీష్, జకరయ్య పాల్గొన్నారు.

నేడు ఏరియా వర్క్‌షాప్ సొసైటీ ఎన్నికలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధి ఏరియా వర్క్‌షాప్‌లో కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఏడు డైరెక్టర్ పోస్టులకు గాను ఒకటి మహిళకు, మరో పోస్టు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కేటాయించారు. ఇక మిగిలిన ఐదు డైరెక్టర్ పోస్టులకు గాను ఆరుగురు ఐఎన్‌టీయూసీ నుంచి, ఐదుగురు ఏఐటీయూసీ నుంచి పోటీ పడుతున్నారు. జిల్లా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించే ఈ ఎన్నికల్లో 56 మంది సభ్యులు ఓటు వేయాల్సి ఉంటుంది. కాగా, నామినేషన్ పద్ధతిలో డైరెక్టర్లను ఎన్నుకోవాలని వర్క్‌షాపు ఎస్‌ఈ సొసైటీ అధ్యక్షుడు శ్రీకాంత్ ప్రతిపాదించారు. ఐదు పోస్టుల్లో రెండు ఏఐటీయూసీకి, మూడు ఐఎన్‌టీయూసీ నేతలను తీసుకోవాలని సూచించినా ఎవరికి వారు మూడు డైరెక్టర్ పోస్టులు కావాలని పట్టుబట్టడంతో ఎన్నిక అనివార్యమైంది.

కలెక్టర్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల



కలెక్టర్‌ను సత్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/పాల్వంచ: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జితేష్ వి.పాటిల్‌ను డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కొత్వాల పాల్వంచలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఎదురవుతున్న సమస్యను వివరించారు. కాంగ్రెస్ నాయకులు జాలె జానకిరెడ్డి, కొండెం వెంకన్న, సాదం రామకృష్ణ, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కనగాల నారాయణ, కాపర్తి వెంకటాచారి, గంగుల భువనసుందర్‌రెడ్డి, యర్రంశెట్టి మధు, చింతా నాగరాజు పాల్గొన్నారు. అలాగే, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో కొత్వాల సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇక కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి కృష్ణ సైతం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలవగా నాయకులు చిన్నంశెట్టి రంగారావు, చావా వీరయ్య పాల్గొన్నారు. అలాగే, ప్రకృతి ఆశ్రమం సభ్యులు సైతం కలెక్టర్ పాటిల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బోధనలో ప్రత్యేకత చూపండి..



కొత్తగూడెంటౌన్: కూలీలైన్ అంగన్‌వాడీ సెంటర్ ఆధ్వర్యంలో బడిబాట

ఇల్లెందురూరల్: చిన్నారుల వయస్సును దృష్టిలో పెట్టుకుని వారికి అర్థమయ్యే విధంగా బోధన చేపట్టి ప్రత్యేకత చూపాలని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. అంగన్‌వాడీ పాఠశాలల చిన్నారుల కోసం ప్రభుత్వం రూపొందించిన నూతన సిలబస్ బోధన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహిస్తున్న రెండోరోజు శిక్షణ శిబిరం మండలంలోని సంజయ్‌నగర్ అంగన్‌వాడీ పాఠశాలలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరళమైన పదాలతో నూతన సిలబస్ ఆకట్టుకునేలా ఉందని, ఆటపాటలతో విద్యాబోధన చేపట్టి చిన్నారులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనీలు కవిత, శారద నూతన సిలబస్ బోధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏసీడీపీఓ విజయకుమారి, సూపర్‌వైజర్లు లక్ష్మీకుమారి, జ్యోతి, అన్నపూర్ణ, కోటమ్మ, జయ, సరిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో చిన్నారులకు ఆరోగ్యం..

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని 23వ వార్డు కూలీలైన్‌లో మంగళవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ అరుణకుమారి, కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ప్రతీ తల్లిదండ్రులు ఐదు సంవత్సరాల్లోపున్న తమ చిన్నారులను అంగన్‌వాడీకి పంపాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం, బాలామృతం, పాలు, గుడ్లు, బిస్కెట్లు ఇవ్వడం జరుగుతందన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో అందించే పౌష్టికాహారంతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యమన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, టీచర్లు గోగి రాధ, రజనీ, ఆయాలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

పాల్వంచ: హైదరాబాద్ హకీంపేట తెలంగాణ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశానికి ఎంపికలను ఈనెల 27న పాల్వంచ మండలం లక్ష్మీదేవి పంచాయతీలోని సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ శ్రీరామ్మూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్యలో జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డ్, స్టడీ సర్టిఫికెట్, రెండు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

సుజాతనగర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కొరకు నేడు, రేపు సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేపట్టనున్నట్లు మండల విద్యాశాఖాధికారి జుంకీలాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2016 ఆగస్టు 31లోపు జన్మించిన వారు ఈ ఎంపికలకు అర్హులని, చుంచుపల్లి, సుజాతనగర్ మండల విద్యార్థులకు 26న, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం మండలాల విద్యార్థులకు 27న ఎంపికలు జరగనున్నట్లు తెలిపారు. ఎత్తు, బరువు, షటిల్ రన్, మెడిషన్ బాల్ త్రో తదితర తొమ్మిది అంశాల్లో ప్రతిభ కనబరిచిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపనున్నట్లు తెలిపారు.

టేకులపల్లి: హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశాలకు మండల స్థాయిలో ఎంపికలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలురకు నిర్వహించిన ఎంపికలను కాంప్లెక్స్ హెచ్‌ఎం మెరుగు శ్రీనివాస్ ప్రారంభించారు. బుధవారం బాలికలకు ఎంపికల ఉంటాయని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో బుగ్గ వెంకటేశ్వర్లు, భూక్యా సైదులు, పి.శేఖర్, బి.మంజీలాల్ పాల్గొన్నారు.

రక్తహీనత నిర్మూలనే లక్ష్యం



టేకులపల్లిలో మానవహారం

కొత్తగూడెంటౌన్: 2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియాను పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో అన్నిశాఖల ఆధ్వర్యంలో ప్రతీ అంగన్‌వాడీలలో ప్రచారం చేస్తున్నామని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి వేల్పుల విజేత అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని అంగన్‌వాడీ సెంటర్లలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 25వ వార్డులోని అంగన్‌వాడీ సెంటర్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విజేత మాట్లాడుతూ.. రక్త సంబంధమైన వ్యాధులకు గురికాకుండా వైద్యులను సంప్రదించి వైద్య సహాయం తీసుకోవాలని ఏదైనా సమస్యలు వస్తే ఆరోగ్యపరంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఆయా సెంటర్లలో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఆరుణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, ఉమాదేవి, శారద, టీచర్లు పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తగూడెం మధురబస్తీ అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుణలక్ష్మి, రూప, ప్రతిభ భారతి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనే లక్ష్యం అని మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్ అన్నారు. వైద్యశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనపై సుజాతనగర్‌లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధతి పాల్గొన్నారు.

టేకులపల్లి: సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనకు ప్రతీఒక్కరు సహకరించాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు, సీడీపీఓ కేఎం తార పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్, జిల్లా మహిళా శిశు దివ్యాంగ వయోవృద్ధుల సంక్షేమ శాఖల ఆదేశానుసారం ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. మాట్లాడుతూ జూలై మూడో తేదీ వరకు జరిగే అవగాహన సదస్సులతో పాటు వ్యాధి నిర్ధారణకు జరిగే స్క్రీనింగ్ పరీక్షలను ఉపయోగించుకోవాలని మండల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సులానగర్ పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఎంపీఓ గణేష్ గాంధీ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, గుజ్జ విజయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనురాధ, సక్కుబాయి, లక్ష్మి, నిర్మల, యశోద, రమేష్‌బాబు, అంగన్‌వాడి టీచర్లు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.